సాక్షి
సిద్దిపేట
ఆదివారం । 24 । ఆగస్టు । 2025



సండే స్పెషల్

# వసుదైక కుటుంబం



సృష్టిలో మనిషికి మనిషే తోడు. సేవాభావంలోను సాయపడటంలోనే మానవత్వం పరిమళిస్తుంటుంది. సేవ, సాయమే పరమావధిగా పనిచేసే మనుషులందరూ ఒకే చోట ఉంటూ పొరుగువారి సమస్యను తమదిగా భావించి పరిష్కరిస్తున్నారు తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని గేటెడ్ కమ్యూనిటీ వాసులు. వట్టి మాటలు కట్టిపెట్టి గట్టి మేల్ తలపెట్టవోయ్ అన్న గురజాడ పలుకుల్ని ఆదర్శంగా తీసుకున్నారేమో వీరంతా. ఎక్కడెక్కడి వారో ఇక్కడకు చేరి సేవలోనూ, సాయమందించడంలోనూ తమ ఉదారతను దాతృత్వాన్ని చాటుకుంటూ ఏకత్వంలో భిన్నత్వాన్ని, భిన్నత్వంలో ఏకత్వాన్ని ప్రదర్శిస్తున్న ఈ 'గ్రేటెడ్'కమ్యూనిటీ వాసులపై 'సాక్షి'సండే స్పెషల్.

వివరాలు 8లో

## న్యూస్‌రీల్

### 13న జాతీయ లోక్ అదాలత్



మాట్లాడుతున్న న్యాయమూర్తి సాయిరమాదేవి

సిద్దిపేటకమాన్: సెప్టెంబర్ 13న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో క్రిమినల్ కేసులు, సివిల్, చెక్ బౌన్స్, మోటారు వాహన కేసులు రాజీపడేలా చూడాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయిరమాదేవి తెలిపారు. శనివారం జిల్లా కోర్టులో పోలీసు, రెవెన్యూ, ఎక్సైజ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ కె. హైమావతి, సీపీ అనురాధ, న్యాయమూర్తులు జయప్రసాద్, మిలింద్ కాంబ్లి, సంతోష్‌కుమార్, సాధన, రేవతి, స్వాతిగౌడ్, జితేందర్, కాంతారావు, రాజశేఖర్ రెడ్డి, పీపీ జీవన్‌రెడ్డి, అడిషనల్ పీపీ ఆత్మారాములు, ఏసీపీ రవీందర్‌రెడ్డి, సీఐలు తదితరులు పాల్గొన్నారు.

### కూడవెల్లి ఆలయం అభివృద్ధికి కృషి

మంత్రి కొండా సురేఖ



స్వామివారి ఫొటోను బహూకరిస్తున్న నాయకులు

దుబ్బాక: దక్షిణకాశీగా ప్రసిద్ధిగాంచిన కూడవెల్లి రామలింగేశ్వర ఆలయం అభివృద్ధికి కృషి చేస్తానని దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. శనివారం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయం చైర్మన్ రాజిరెడ్డి మంత్రి సురేఖను కలిసి ఆలయం అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని విన్నవించారు. స్పందించిన ఆమె తప్పకుండా నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. మంత్రి సానుకూలంగా స్పందించడంతో కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు అనంతుల శ్రీనివాస్, ఏసురెడ్డి, రవి, శ్రీరాం నరేందర్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

### శ్యాంసుందర్‌కు డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న శ్యాంసుందర్

దుబ్బాక: దుబ్బాక ప్రభుత్వ డిగ్రీ కళాశాల రసాయన శాస్త్రం అధ్యాపకులు, అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్యాంసుందర్‌కు హైదరాబాద్ గీతం డీమ్డ్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. శ్యాంసుందర్ సింథసిస్ అండ్ క్యారెక్టరైజేషన్ ఆఫ్ బెంజాక్సజోల్స్, థియాజోలిడిన్ డయోన్స్ అండ్ బయోలాజికల్ డాకింగ్ స్టడీస్‌పై చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది. పర్యవేక్షకులు సుధాకర్ ఆధ్వర్యంలో శ్యాంసుందర్ చేసిన పరిశోధన ఫలితాలు రెండు అంతర్జాతీయ పరిశోధనా జర్నల్స్ లెటర్స్ ఆన్ ఆర్గానిక్ కెమిస్ట్రీతో పాటు రష్యన్ జర్నల్ ఆఫ్ ఆర్గానిక్ కెమిస్ట్రీలో ప్రచురితమయ్యాయి. శ్యాంసుందర్‌కు డాక్టరేట్ రావడంపై ప్రిన్సిపాల్ భవాని అధ్యాపకులు అభినందించారు.

### ఉత్తమ ప్రతిభకు పురస్కారం

సిద్దిపేట సీపీ అనురాధ



విద్యాసాగర్‌కు నగదు పురస్కారం అందజేస్తున్న సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్: ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీస్ అధికారులు, సిబ్బందికి అవార్డులు, రివార్డులు అందించనున్నట్లు సీపీ అనురాధ తెలిపారు. శనివారం సిద్దిపేట పోలీసు కమిషనరేట్ పరిధిలో జూన్ నెలలో విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులు, సిబ్బందికి సీపీ ప్రశంసా పత్రాలు అందజేశారు. చేర్యాల పట్టణంలోని చెరువులో దూకి ఆత్మహత్యకు ప్రయత్నించిన మహిళను కాపాడిన కానిస్టేబుల్‌ను అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఎక్కువ మంది గంజాయి నేరస్తులను అరెస్టు చేసినందుకు తెలంగాణ నార్కోటిక్ బ్యూరో నుంచి నగదు పురస్కారం అందజేశామన్నారు. 32మందికి కేపీఐ రివార్డులు అందజేసినట్లు చెప్పారు. 11 మంది పోలీస్ అధికారులకు నగదు పురస్కారం అందజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ డీసీపీ సుభాష్‌చంద్రబోస్, ఏసీపీలు రవీందర్ రెడ్డి, నర్సింలు, అధికారులు పాల్గొన్నారు.

# ట్రిపుల్‌ఆర్.. ఐదు ప్యాకేజీలు

**30 కిలోమీటర్లకు ఒకటి..**

- పూర్తి కావొస్తున్న త్రీడీ, త్రీజీ నోటిఫికేషన్లు
- త్వరలో పనుల ప్రారంభానికి సన్నాహాలు

ట్రిపుల్‌ఆర్ ఉత్తర భాగం పనుల అంశం కొలిక్కి వచ్చింది. 161.518 కిలోమీటర్ల మేర చేపట్టనున్న ఈ పనులను ఐదు ప్యాకేజీలుగా విభజించినట్లు స్పష్టమవుతోంది. ప్రస్తుతం త్రీడీ నోటిఫికేషన్ పూర్తి కాగా, త్రీజీ కూడా తుది దశకు చేరుకోబోతుంది. ఈ క్రమంలోనే పరిహారం పంపిణీ చేపట్టడానికి రంగం సిద్ధమైంది. పనిలో పనిగా టెండర్ ప్రక్రియను సైతం వేగిరం చేసి పనులు ప్రారంభించడానికి సంబంధిత యంత్రాంగం సన్నాహాలు చేస్తుంది. – గజ్వేల్



ట్రిపుల్‌ఆర్ ఉత్తర భాగం మ్యాపు

ట్రిపుల్‌ఆర్ ఉత్తర భాగం పనులు ఎలా చేపట్టాలనే అంశంపై సుదీర్ఘ కసరత్తు చేసిన అధికారులు చివరకు ఐదు ప్యాకేజీలుగా చేపట్టడానికి నిర్ణయానికి వచ్చారు. ప్యాకేజీగా 30 కిలోమీటర్‌కు పైగా విభజించి పనులు చేపట్టే ఆలోచనతో ఉన్నట్లు తెలుస్తోంది. 161.518 కిలోమీటర్ల మేర పనులు జరగనుండగా, ఇందులో 100 కిలోమీటర్లపైగా నిడివి ఉమ్మడి మెదక్ జిల్లాలోనే ఉంది. ఈ క్రమంలోనే మూడు ప్యాకేజీల పనులు ఇక్కడ జరగనున్నాయి. మరో ముఖ్య విషయమేమిటంటే గజ్వేల్ కేంద్రంగా ఏర్పాటు చేసిన నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా(ఎన్‌హెచ్‌ఏఐ) కార్యాలయం ఈ పనులను పూర్తిస్థాయిలో పర్యవేక్షించనుంది.

**పరిహారం పంపిణీకి సన్నాహాలు**

భూసేకరణ కోసం ఉమ్మడి నల్గొండ జిల్లాతో పాటు ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలోని రెవెన్యూ డివిజన్ల వారీగా కాలా (కాంపిటెంట్ అథారిటీ ఫర్ ల్యాండ్ అక్విజైషన్)లు పనిచేస్తున్న సంగతి తెల్సిందే. చౌటుప్పల్, యాదాద్రి- భువనగిరి, గజ్వేల్, తూప్రాన్, నర్సాపూర్, ఆందోల్–జోగిపేట, సంగారెడ్డి కాలాల పరిధిలోని 84 గ్రామాల్లో త్రీడీ నోటిఫికేషన్‌లో భాగంగా 4,832.5 ఎకరాల వరకు భూసేకరణ లక్ష్యంగా ఉండగా, ఇందులో 4,747.5 ఎకరాలను సేకరించారు. ఈ లెక్కన 98 శాతం భూసేకరణ పూర్తయ్యింది. త్రీజీ నోటిఫికేషన్‌లో పరిహారం పంపిణీకి సంబంధించిన అంశంపై కసరత్తు ముమ్మరంగా సాగుతోంది. ఇప్పటివరకు 86 శాతం ప్రక్రియ పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ క్రమంలోనే పరిహారం పంపిణీకి త్వరలోనే చర్యలు చేపట్టబోతున్నారు. పరిహారం పంపిణీ తర్వాత భూములు స్వాధీనం చేసుకోవడానికి అధికారులు సన్నద్ధమవుతున్నారు. దీని తర్వాత టెండర్ ప్రక్రియ పూర్తి చేసి పనులను సైతం ప్రారంభించే ఆలోచనతో ఉన్నారు.

**అటవీశాఖకు భూముల అప్పగింత పూర్తి**

ట్రిపుల్‌ఆర్ కోసం సేకరిస్తున్న భూమిలో 180 ఎకరాల అటవీ భూమి ఉంది. ఇందులో భాగంగానే ప్రత్యేకించి గజ్వేల్‌లోనే 70 ఎకరాల భూమిని అటవీశాఖ కోల్పోతుంది. ఈ భూమికి బదులుగా మహబూబాబాద్‌లో 180 ఎకరాల భూములను అటవీశాఖకు కేటాయించారు. ఈ భూముల అప్పగింతను అధికారికంగా పూర్తి చేశారు. ఇకపోతే మరో 650 ఎకరాల ప్రభుత్వ భూమిని సైతం ట్రిపుల్‌ఆర్ కోసం సేకరిస్తున్నారు.

**మరికొన్ని నెలల్లో ప్రారంభిస్తాం**

ట్రిపుల్‌ఆర్ ఉత్తర భాగం పనులను మరికొన్ని నెలల్లో ప్రారంభించడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ పనులను ఐదు ప్యాకేజీలుగా చేపట్టాలని నిర్ణయించాం. త్రీడీ నోటిఫికేషన్ పూర్తయ్యింది. త్రీజీ కూడా త్వరలోనే పూర్తి కానుంది. కాలాల ఆధ్వర్యంలో పరిహారం పంపిణీ కూడా జరగనుంది. దీని తర్వాత పనులు ప్రారంభం కానున్నాయి.

– మాధవి,
ఎన్‌హెచ్‌ఏఐ ప్రాజెక్ట్ డైరెక్టర్, గజ్వేల్



ఎల్లమ్మ చెరువు సుందరీకరణ పనులు పరిశీలిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

# పర్యాటక కేంద్రంగా ఎల్లమ్మ చెరువు

- జూబ్లీహిల్స్ పెద్దమ్మ ఆలయంలా అభివృద్ధి చేస్తాం
- యూరియా పంపిణీలో విజిలెన్స్ మానిటరింగ్ ఉండాలి
- మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్: ఎల్లమ్మ చెరువును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. హుస్నాబాద్ పట్టణంలో మంత్రి శనివారం పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా ఎల్లమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో జరుగుతున్న పెండింగ్ పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రూ.15 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఎల్లమ్మ చెరువు ఆధునీకరణ పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ...ఎల్లమ్మ చెరువులో చేపడుతున్న అక్రమ మట్టి తరలింపునకు అడ్డుకట్ట వేయాలన్నారు. ఎల్లమ్మ సుందరీకరణ పనుల పురోగతి బతుకమ్మ, దసరాలోపు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ పెద్దమ్మ దేవాలయం మాదిరిగా ఎల్లమ్మ దేవాలయాన్ని అభివృద్ధి చేస్తామని హామీనిచ్చారు. 250 పడకల ఆస్పత్రి పనులు ప్రారంభమయ్యాయని, అది పూర్తికాగానే పీజీ కళాశాల పనులను ప్రారంభిస్తామని మంత్రి చెప్పారు. గౌరవెల్లి ప్రాజెక్టును త్వరలోనే పూర్తి చేస్తామని, కాలువల నిర్మాణానికి రైతులు సహకరించాలని కోరారు.

**మూడు జిల్లాల కలెక్టర్లతో మాట్లాడిన మంత్రి**

యూరియా సరఫరాపై సిద్దిపేట, కరీంనగర్, హన్మకొండ జిల్లాల కలెక్టర్లతో మంత్రి పొన్నం ఫోన్‌లో మాట్లాడారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సరిపడా యూరియాను అందించాలన్నారు. ఎరువుల పంపిణీలో ఎలాంటి లోపాలు చేసుకోకుండా విజిలెన్స్ మానిటరింగ్ చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్ విండో అధ్యక్షుడు బొలిశెట్టి శివయ్య, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, ఎల్లమ్మ దేవాలయ కార్యనిర్వహణ అధికారి కిషన్‌రావు తదితరులున్నారు.

# శాస్త్రవేత్తలుగా ఎదగాలి

- దేశస్థాయిలో వర్గల్ ఖ్యాతి ఇనుమడింపజేయాలి: ఎంపీ రఘునందన్
- నవోదయలో ఘనంగా జాతీయ అంతరిక్ష దినోత్సవం

వర్గల్(గజ్వేల్): శాస్త్ర సాంకేతిక రంగాలు అద్భుతంగా పురోగమిస్తున్న వేళ.. నవోదయ విద్యార్థులు దేశం గర్వించేస్థాయిలో శాస్త్రవేత్తలుగా ఎదగాలని, వర్గల్ ఖ్యాతిని ఇనుమడింపజేయాలని మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్‌రావు పిలుపునిచ్చారు. శనివారం ఉమ్మడి మెదక్‌జిల్లాలోని వర్గల్ నవోదయ విద్యాలయంలో జాతీయ అంతరిక్ష దినోత్సవ కార్యక్రమానికి ఆయన డీఆర్‌డీఓ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ రామచందర్‌రావుతో కలిసి హాజరయ్యారు. వారికి ప్రిన్సిపాల్ దాసి రాజేందర్ ఆధ్వర్యంలో విద్యాలయ పరివారం, విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని వారు ఆవిష్కరించారు. అనంతరం అంతరిక్ష రంగానికి సంబంధించి ఆర్యభట్ట నుంచి చంద్రయాన్, గగనయాన్ దాకా భారత పరిశోధనలు, విజయాలు సూచిస్తూ విద్యార్థులు ఏర్పాటు చేసిన ఎగ్జిబిట్లు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమున్నత ఆశయంతో విద్యార్థులు ముందుకుసాగుతూ ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. భావిపౌరులుగా 2047 నాటికి దేశాన్ని అభివృద్ధిచెందిన దేశంగా మార్చాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రాజేందర్ విద్యాలయలో అభివృద్ధి పనులు వివరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్, నాయకులు కప్పర ప్రసాద్‌రావు, శ్రీనివాస్, గాడిపల్లి భాస్కర్, నందన్‌గౌడ్, రాంరెడ్డి, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎగ్జిబిట్లు తిలకిస్తున్న రఘునందన్, డీఆర్‌డీఓ శాస్త్రవేత్త రామచందర్‌రావు, ప్రిన్సిపాల్

## విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలి

వర్గల్(గజ్వేల్): భూనిర్వాసిత రైతులు సాగు చేసిన పొలాలకు వెంటనే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. వర్గల్ ఫుడ్‌ప్రాసెసింగ్ జోన్‌లో భూములు కోల్పోయిన రైతులు శనివారం వర్గల్ మండలం అవుసులోనిపల్లి కెనాల్ వద్ద ఆయనను కలిసి న్యాయం చేయాలంటూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిశ్రమలు అక్కడ ఏర్పాటు కాకపోవడంతో భూనిర్వాసిత రైతులు పంటలు సాగు చేసుకున్నారని, పంట సగంలో హఠాత్తుగా అర్ధరాత్రి అధికారులు విద్యుత్ సరఫరా కట్ చేయడం సరికాదన్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌కు ఫోన్ ద్వారా పరిస్థితి వివరించారు. ముందే చెబితే రైతులు నాట్లు వేసేవారు కాదన్నారు. విద్యుత్ పునరుద్ధరణ చేయాలని కోరారు. విద్యుత్ పునరుద్ధరణ చేయకపోతే బీజేపీ ఆధ్వర్యంలో రైతుల తరఫున పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.

# డిప్యుటేషన్లు రద్దు చేయండి

- డీఎంహెచ్‌కు కలెక్టర్ ఆదేశం
- చింతమడక పీహెచ్‌సీ తనిఖీ

సిద్దిపేటరూరల్: ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని కలెక్టర్ కె.హైమావతి అన్నారు. శనివారం మండల పరిధిలోని చింతమడక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా రోగులకు అందించే వైద్య సేవలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అటెండెన్స్ రిజిస్టర్, ఓపి రిజిష్టర్‌ను తనిఖీ చేశారు. వైద్యాధికారి భాస్కర్ 13వ తేదీ నుంచి రావడం లేదని అడగగా వర్గల్ మండలంలో డిప్యుటేషన్ ఉన్నట్లు సిబ్బంది తెలిపారు. వెంటనే డీఎంహెచ్‌ఓతో మాట్లాడి రోజు 70 నుంచి 80 మంది వరకు ఓపి ఉండే ఆసుపత్రికి డాక్టర్‌ని డిప్యుటేషన్ ఇవ్వకూడదని, తప్పకుండా రెగ్యులర్ డాక్టర్‌ను అందుబాటులో ఉంచాలన్నారు. అన్ని డిప్యుటేషన్‌లను రద్దు చేయాలన్నారు. సీహెచ్‌ఓ లింగయ్య సెలవు మంజూరు కాకముందే సెలవు తీసుకున్నారని రిజిస్టర్‌లో కలెక్టర్ కంప్లెయింట్ రాశారు. ఆసుపత్రికి వచ్చిన రోగులతో మాట్లాడుతూ డాక్టర్లు వస్తారా అని ఆరాతీయగా డాక్టర్ అప్పుడప్పుడు వస్తారని, నర్సులు సేవలందరిస్తారని రోగులు కలెక్టర్‌కు తెలిపారు.



రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ హైమావతి

**మట్టి గణపతులను పూజిద్దాం**

వినాయక చవితి పండగ సందర్భంగా ప్రతి ఒక్కరూ మట్టి గణపతులను ప్రతిష్ఠించి పూజించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడాలని కలెక్టర్ హైమావతి సూచించారు. శనివారం కలెక్టరేట్‌లో కాలుష్య నియంత్రణ మండలి, కేంద్ర కార్యాలయం ఆధ్వర్యంలో రూపొందించిన గోడ పత్రికలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి, ప్రాంతీయ కార్యాలయం, పర్యావరణ ఇంజనీర్ కుమార్ పాఠక, టి.రవీందర్, పర్యావరణ శాస్త్రవేత్త, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అదే వరుస.. అదే ప్రయాస

**యూరియా కోసం రైతుల పాట్లు**

- ఉదయం నుంచే పడిగాపులు
- అధికారులను నిర్బంధించే యత్నం
- అడ్డుకున్న పోలీసులు

మిరుదొడ్డి(దుబ్బాక)/దుబ్బాకటౌన్/దౌల్తాబాద్(దుబ్బాక)/సిద్దిపేటకమాన్:/సిద్దిపేటఅర్బన్: యూరియా కొరత రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. యూరియా వస్తుందని తెలిస్తే చాలు అన్నదాతలు అర్ధరాత్రే యూరియా కేంద్రాల వద్ద వాలిపోతున్నారు. పట్టా పాస్‌పుస్తకాలు, చెప్పులు క్యూ లైన్లో ఉంచి పడిగాపులు కాస్తున్నారు. అయినా ఒకటి, రెండు యూరియా బస్తాలు దొరకడమే గగనంగా మారిపోయింది. మిరుదొడ్డి మండల పరిధిలోని అల్వాల గ్రామానికి రెండు లారీల్లో 1,108 యూరియా బస్తాలు వచ్చాయి. విషయం తెలుసుకున్న రైతులు శుక్రవారం అర్ధరాత్రి నుంచే క్యూ లైన్‌లో పడిగాపులు కాచారు. అధికారులు రెండేసి బస్తాలు పంపిణీ చేశారు. అయితే యూరియా దొరకని రైతులు ఆగ్రహించి రైతు వేదికలో ఉన్న వ్యవసాయ అధికారులను నిర్బంధించే ప్రయత్నం చేశారు. అదేవిధంగా దౌల్తాబాద్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్ద రైతులు యూరియా కోసం ఉదయం నుంచే కాచుకొని కుర్చున్నారు. గంటల తరబడి లైన్‌లో ఉన్నా యూరియా దొరకడం కష్టంగా మారిందని రైతులు వాపోయారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉంచకపోవడం వల్లే రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలంగాణ రైతు సంఘాల సమాఖ్య అధ్యక్షుడు శ్రీరామ్‌రెడ్డి వాపోయారు. ప్రభుత్వానికి ముందు చూపు లేకపోవడం వల్లే రాష్ట్రంలో రైతులు యూరియా కోసం క్యూ లైన్లు కట్టే పరిస్థితి వచ్చిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చుక్క రాములు ఆరోపించారు. కార్మిక, కర్షక భవన్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యూరియా కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సరిపడా యూరియాను సరఫరాచేసి రైతుల ఇబ్బందులను తొలగించాలని డిమాండ్ చేశారు.



దుబ్బాకటౌన్: టోకెన్లు ఇచ్చే కౌంటర్ వద్ద రైతుల తోపులాట



దుబ్బాకటౌన్: రాయపోల్‌లో చెప్పలను క్యూలైన్‌లో ఉంచిన రైతులు



మిరుదొడ్డి: పట్టా పాసు పుస్తకాలు క్యూ లైన్‌లో పెట్టి బారులు తీరిన రైతులు



మిరుదొడ్డి(దుబ్బాక): యూరియా బస్తాల కోసం వచ్చిన రైతులు

# ఎరువుల ఇబ్బందులు ఉండొద్దు

**అధికారుల సమీక్షలో ఎమ్మెల్యే హరీశ్‌రావు**



సిద్దిపేటజోన్: నియోజకవర్గ పరిధిలో రైతులెవరూ ఎరువుల కోసం ఇబ్బంది పడకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే, మాజీమంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. వ్యవసాయశాఖ అధికారులతో శనివారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఆయా మండలాల వారీగా యూరియా సరఫరా, ఇండెంట్ గురించి ఆరా తీశారు. నియోజకవర్గంలో రైతులు ఎరువుల కొరతతో ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు నిర్లక్ష్యం వీడాలని సూచించారు. ఈ వానాకాలం సీజన్‌లో 11,600 మెట్రిక్ టన్నులకుగాను 4,772 మెట్రిక్ టన్నులే సరఫరా చేశారని మిగతా 6,878 మెట్రిక్ టన్నులను ఎప్పుడు సరఫరా చేస్తారని ప్రశ్నించారు. రైతులు యూరియా కేంద్రాల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్య తీవ్రతను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. పంట నష్టం, రైతు బీమా అందించడానికి ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని సూచించారు.

# పేదరికం పరిధులు దాటి..

**సీఐఎస్‌ఎఫ్ అసిస్టెంట్ ఉద్యోగం సాధించిన యువకుడు**

తొగుట(దుబ్బాక): సంకల్ప బలముంటే విధి కూడా తలవంచుతుందని నిరూపించాడో నిరుపేద యువకుడు. మండల పరిధిలోని ఎల్లారెడ్డిపేటకు చెందిన నర్మెట ఎల్లవ్వ, రాములు దంపతులు రెక్కల కష్టంతో కూలి పనులు చేసుకుంటూ జీవనం గడుపుతుండేవారు. వీరికి మనోజ్ కుమార్ కుమారుడు. ఎలాగోలా కష్టపడి మనోజ్ కుమార్‌ను డిగ్రీ వరకు చదివించారు. ఇదేక్రమంలో తండ్రి రాములు మరణించాడు. దీంతో తన తల్లిని కష్టాల నుంచి గట్టెంక్కించాలన్న సంకల్పంతో కొన్నాళ్లు కేంద్ర ప్రభుత్వ విభాగంలోని సీఎస్‌ఎఫ్ (సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్)లో కానిస్టేబుల్‌గా ఢిల్లీ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టులో విధులు నిర్వహించాడు. తను పనిచేస్తున్న విభాగంలో మరింత ఉన్నత ఎత్తుకు ఎదగాలనుకుని కానిస్టేబుల్‌గానే విధులు నిర్వర్తిస్తూనే సీఐఎస్‌ఎఫ్‌లో అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగం సాధించాడు. హకీంపేటలో గత ఆరు నెలలుగా కఠినమైన ట్రైనింగ్‌ను పూర్తి చేసుకుని తన పాసింగ్ అవుట్ పరేడ్‌ను పూర్తి చేశాడు. ఉద్యోగం వచ్చిన ఆనందంతో తన తల్లి ఎల్లవ్వతో సంతోషాన్ని పంచుకున్నాడు. ఉద్యోగం సాధించుకున్న మనోజ్‌కుమార్‌ను అభినందిస్తూ గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.



తల్లితో సంతోషాన్ని పంచుకుంటున్న మనోజ్‌కుమార్

## శాంతించిన మంజీరా

పాపన్నపేట(మెదక్): తొమ్మిది రోజులుగా మంజీరా నీటిలో మునిగిన ఏడుపాయల దుర్గమ్మ ఆలయ బ్రిడ్జి శనివారం తేలింది. వరుసగా మంజీరా ప్రవాహం కొనసాగుతుండటంతో ఆలయ ప్రాంగణం గడ్డి, నాచుతో నిండిపోయింది. అయితే ఆ దివారం సింగూరు నీటి వరద పరిస్థితిని బట్టి నిర్ణయం తీసుకుంటామని ఇరిగేషన్ ఏఈ సతీశ్ తెలిపారు.

## క్లుప్తంగా

### ఆర్డీఎఫ్ పాఠశాలను సందర్శించిన అమెరికా ప్రతినిధి



విద్యార్థులతో మాట్లాడుతున్న అమెరికా ప్రతినిధి దేసిఫార్కర్

**సిద్దిపేటరూరల్:** నారాయణరావుపేట మండల పరిధిలోని మాటిండ్ల ఆర్డీఎఫ్ పాఠశాలను అమెరికాకు చెందిన దేసిఫార్కర్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె పాఠ్య, సహపాఠ్య, పాఠ్యేతర కార్యక్రమాలను తిలకించారు. ప్రపంచస్థాయి సమగ్ర విద్యను అందిస్తున్న పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు. పాఠశాల కరెస్పాండెంట్ విష్ణుమూర్తి, ప్రధానోపాధ్యాయుడు బాపురెడ్డి పాల్గొన్నారు.

### ఉచిత కోచింగ్

**సిద్దిపేటఅర్బన్:** సిద్దిపేట ఐటీ హబ్‌లోని టాస్క్ కార్యాలయంలో టెక్నికల్ కోర్సులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు మేనేజర్ నరేందర్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. కోర్సులు జావా, పైథాన్, వెబ్ డెవలప్‌మెంట్, డేటాబేస్, సుడో కోడ్, సీ, సీప్లస్ ప్లస్, హెచ్‌టీఎంఎల్, సీఎస్ఎస్, జావా స్క్రిప్ట్, ఆప్టిట్యూడ్ రీజనింగ్, సాఫ్ట్ స్కిల్స్‌పై శిక్షణ ఇవ్వనున్నారు. ఏదైనా డిగ్రీ పూర్తి చేసి, ఆసక్తి కలిగిన అభ్యర్థులు టాస్క్ కార్యాలయంలో ఈ నెల 25, 26 తేదీల్లో సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

### ఏఐ అత్యంత ఆచరణీయం

**మెదక్‌జోన్:** ప్రభుత్వ పాలనా వ్యవస్థలో ఏఐ ప్రాధాన్యత అత్యంత ఆచరణీయమని కాకతీయ విశ్వవిద్యాలయం మాజీ ప్రొఫెసర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండు రోజులుగా ప్రభుత్వ పాలనా శాస్త్ర విభాగం, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్ , సదరన్ రీజియన్ హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ సదస్సు శనివారంతో ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. అన్ని రంగాల్లో అనుసరిస్తున్న కృత్రిమ మేధస్సు ఆవశ్యకతను వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ హుస్సేన్, ఆర్డీఓ రమాదేవి, సమన్వయకర్త సురేందర్‌రావు, అధ్యాపకులు డాక్టర్ శరత్‌రెడ్డి, తిరుమలరెడ్డి పాల్గొన్నారు.

### పేకాట స్థావరంపై దాడి

**దుబ్బాకరూరల్:** పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన భూంపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం... మండలంలోని గ్రామ శివారులో కొంత మంది పేకాట ఆడుతున్నారని వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. వారి వద్ద నుంచి రూ.29,375 , 5 మొబైల్ ఫోన్లు, నాలుగు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఐదుగురిని అదుపులోకి తీసుకోగా మరో ఇద్దరు వ్యక్తులు పరారీలో ఉన్నారు. పేకాట ఆడుతున్న వారు తాళ్లపల్లి, రుద్రారం గ్రామాలకు చెందిన వారిగా గుర్తించారు.

### గంజాయి స్వాధీనం

**మునిపల్లి(అందోల్):** అరకిలో ఎండు గంజాయిని తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. బుదేరా ఎస్ఐ రాజేశ్ నాయక్ వివరాల ప్రకారం... శనివారం ఉదయం కంకోల్ టోల్ ప్లాజా సమీపంలో కల్వకుర్తికి చెందిన మాడుగుల మారుతి, మరో బాలుడు కలిసి బీదర్ నుంచి గంజాయిని తీసుకొస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు.

### కార్మికుడికి గాయాలు

**జిన్నారం (పటాన్‌చెరు):** పరిశ్రమలో విధులు నిర్వహిస్తున్న కార్మికుడికి గాయాలయ్యాయి. ఈ ఘటన గడ్డపోతారం పారిశ్రామికవాడలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం ... ఎస్ మాక్స్ పరిశ్రమలో పనిచేసే సుధాకర్ విధులు నిర్వహిస్తుండగా క్రేన్ వెనుక నుంచి ఢీకొట్టడంతో కాలు విరిగి ప్రాణాలతో బయటపడ్డాడు. గాయాలైన కార్మికుడిని నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

### అధికారులను తప్పుదోవ పట్టించిన వారిపై కేసు

**కొండపాక(గజ్వేల్):** ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్‌ను పొందడానికి అధికారులను తప్పుదోవ పట్టించిన ఐదుగురిపై కేసు నమోదైంది. కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్ కథనం ప్రకారం... తొగుట మండలంలోని గుడికందుల గ్రామానికి చెందిన ముంద్రాతి యాదయ్య ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్‌ను కొండపాక మండల తహసీల్దార్ కార్యాలయం నుంచి పొందడానికి అధికారులను తప్పుదోవ పట్టించారు. వారిలో మంద్రాతి సరిత , రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ, దుద్దెడ పంచాయతీ కార్యదర్శి చక్రపాణి, సిద్దిపేటలోని పారిపల్లి వీధిలోని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న టి.శంకరయ్య, మద్దూర్ మండల తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న గౌరారం అనిత ఉన్నారు. మంద్రాతి అనిల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

### మద్యం లారీ బోల్తా

**హుస్నాబాద్‌రూరల్:** బీరు కాటన్‌లతో వెళుతున్న లారీ బోల్తాపడింది. మండలంలోని బంజేరుపల్లి క్రాసింగ్ వద్ద శనివారం సంగారెడ్డి నుంచి వరంగల్‌కు వెళుతున్న లారీ అదుపుతప్పి బోల్తా పడింది. సమాచారం తెలుసుకున్న ఎక్సైజ్ ఎస్సై రూప పంచనామా చేశారు. బోల్తా పడిన లారీలోని బీరు కాటన్స్‌ను మరో లారీలో లోడింగ్ చేసి పంపించారు.

# వసుధైక కుటుంబం

## ఉమ్మడి కుటుంబాలకు ఆదర్శం.. గేటెడ్ కమ్యూనిటీలు

ప్రాంతాలు, మతాలు, కులాలు వేరైనా అందరం ఒకే కుటుంబ సభ్యులమంటూ ఆదర్శంగా నిలుస్తున్నారు గేటెడ్ కమ్యూనిటీ కాలనీవాసులు. కాలనీల సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటాలు చేస్తున్నారు. ఏ ఒక్కరికి కష్టం వచ్చినా వారికి అండగా నిలుస్తూ నాటి ఉమ్మడి కుటుంబాలను గుర్తుకు తెస్తున్నారు. అలాంటి కమ్యూనిటీలపై ఈ వారం సాక్షి ప్రత్యేక కథనం.

– రామచంద్రాపురం(పటాన్ చెరు):

- సమస్యల పరిష్కారానికి ఐక్యంగా కృషి
- పండుగేదైనా కలిసి చేసుకుంటారు
- సామాజిక సేవలో సైతం ముందంజ

### సమస్యలపై పోరాటం



రోడ్ల సమస్యలపై ఐక్య పోరాటంలో కాలనీవాసులు

కాలనీల్లో నెలకొన్న సమస్యలపై గేటెడ్ కమ్యూనిటీ వాసులు ఉమ్మడి పోరాటాలు చేస్తూ అందరికి స్ఫూర్తినిస్తున్నారు. ఏ కాలనీలో సమస్య వచ్చినా చిన్నారుల నుంచి వృద్ధుల వరకు రోడ్లపైకి వచ్చి పరిష్కారం కోసం ఉద్యమిస్తున్నారు. దీంతో ప్రతి ఒక్కరిలో అందరం ఒక్కటే అన్న భావన మరింత పెంపొందుతోంది. అలాగే పలువురికి సాయం చేస్తూ తమ మానవత్వాన్ని చాటుకుంటున్నారు.

### మినీ ఇండియా..

హైదరాబాద్ మహానగర శివారు ప్రాంతమైన తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలో సుమారు 70కిపైగా గేటెడ్ కమ్యూనిటీ కాలనీలున్నాయి. అందులో సుమారు 2లక్షల మంది ఉన్నారు. ఇక్కడ ఎక్కువ శాతం ఉత్తర భారతదేశానికి చెందిన వారే నివాసం ఉంటున్నారు. దేశంలోని అనేక రాష్ట్రాలకు చెందిన ఐటీ నిపుణులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు, వ్యాపారవేత్తలు, ప్రముఖులు, ఎన్ఆర్ఐలు.. విల్లాస్, బహుళ అంతస్తుల భవనాలను కొనుగోలు చేసి నివసిస్తున్నారు. అన్ని రాష్ట్రాలకు చెందిన వారు ఉండటంతో ఈ ప్రాంతాన్ని మినీ ఇండియాగా పిలుస్తారు. కాలనీల్లో ఎవరికి కష్టమొచ్చినా వెంటనే అందరూ ముందుకొచ్చి అండగా నిలుస్తున్నారు. ప్రాంతాలను పక్కన పెట్టి ఇక్కడ అందరూ ఒకే కుటుంబ సభ్యులలాగా ఉంటూ జాతీయ ఐక్యతను చాటుతున్నారు.




జగన్నాథ రథయాత్రలో..

### కలిసికట్టుగా పండుగలు

ఇతర రాష్ట్రాల నుంచి వచ్చినా ఆయా ప్రాంతాల వారి సంస్కృతి, సంప్రదాయాలకు అనుగుణంగా కుల, మతాలను పక్కన పెట్టి పండుగలు జరుపుకుంటున్నారు. ప్రతి ఏటా కార్తీక మాసంలో వన భోజనాలను ఘనంగా నిర్వహిస్తారు. ఒడిశా ప్రజలు ఘనంగా జరుపుకునే జగన్నాథ రథయాత్రను అందరూ కలిసి ఎంతో వైభవంగా నిర్వహిస్తారు. దసరా, దీపావళి, రంజాన్, క్రిస్మస్ వేడుకలను సైతం జరుపుకుంటారు.



చెరువు పరిసరాలను శుభ్రం చేస్తున్న చిన్నారులు

### సామాజిక సేవలో సైతం

కాలనీవాసులు సామాజిక సేవలో సైతం ముందున్నారు. స్థానిక చెరువు పరిసరాలను శుభ్రం చేయడంలో చిన్నారులు సైతం చురుకుగా పాల్గొంటున్నారు. ప్రతి వేసవిలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉచిత శిబిరాలు నిర్వహిస్తారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత కారణంగా విద్యార్థులకు తరగతులు కూడా నిర్వహించారు. కోవిడ్ సమయంలో సుమారు 3వేల పేద కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందించారు. అందరూ కలిసి పేద విద్యార్థులకు షూలు, పుస్తకాలు ఇచ్చారు. ఐటీ ఉద్యోగులు ఎవరికైనా ఉద్యోగం కావాలంటే తమ వంతు సహాయ, సహకారాలు అందిస్తున్నారు. ఉన్నత విద్య పూర్తి చేసిన వారికి ఉద్యోగాలు సంపాదించేలా సూచనలు ఇస్తారు.



కోవిడ్ సమయంలో వలస కార్మికులకు నిత్యావసర సరుకులు అందజేస్తూ..

### సొంత గ్రామంలో ఉన్నట్లే..



తాము ఈ ప్రాంతంలో విల్లా కొనుగోలు చేసి నివాసం ఉంటున్నాం. ఇక్కడ ఉన్నప్పటికీ మా సొంత ప్రాంతంలో ఉన్నట్లే ఉంది. అనేక ప్రాంతాలకు చెందిన వారు ఇక్కడ ఉంటున్నారు. కలిసిమెలిసి సంతోషంగా ఉంటాం.

– పి.ఎస్.తివారీ, వ్యాపారవేత్త

### అత్యవసర సమయంలో..



ఆపద వచ్చినప్పుడు అండగా నిలుస్తాం. ఈ ప్రాంతంలో ఉన్న వైద్యులు అత్యవసర సమయంలో వైద్యం అందించటానికి సిద్ధంగా ఉన్నాం.

– డా.భవాని ఈశ్వర్ గారి, తెల్లాపూర్

### సమైక్య భావాన్ని..



దేశంలోని అన్ని రాష్ట్రాల ప్రజలు ఇక్కడ ఉన్నారు. అన్ని పండుగలను కలిసి జరుపుకుంటాం. జాతీయ ఐక్యతను చాటుతూ సమైక్య భావాన్ని పెంపొందిస్తున్నాం.

– చిలకమర్రి ప్రభాకర్ రెడ్డి, తెల్లాపూర్

# తాగునీటి తండ్లాట



వాటర్ ట్యాంకర్ కోసం ఎదురు చూస్తున్న స్థానికులు

- ఐదు రోజులుగా సరఫరా బంద్
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- ఖాళీ బిందెలతో ఎదురు చూపులు

**హుస్నాబాద్:** వర్షాకాలంలో కూడా ప్రజలకు తాగునీటికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మిషన్ భగీరథ నీరు సరఫరా నిలిచిపోవడంతో తల్లడిల్లుతున్నారు. మండలంలోని మహ్మదాపూర్‌లో ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ గ్రిడ్ నుంచి రెండు పంపుల ద్వారా మున్సిపాలిటీతో పాటు పలు మండలాలకు నీటిని సరఫరా చేస్తున్నారు. కానీ, ఐదు రోజుల నుంచి అక్కన్నపేట మండలంలోని 5 గ్రామాలు, భీమదేవరపల్లి మండలంలో 14 గ్రామాలతోపాటు మున్సిపాలిటీ, హుస్నాబాద్, కోహెడ, బెజ్జంకి, గన్నేరువరం , ఇల్లంతకుంట మండలాలకు నీటి సరఫరా నిలిచిపోయింది. భగీరథ గ్రిడ్ నుంచి ప్రతి రోజు 330 లక్షల లీటర్ల (33 ఎంఎల్) నీటిని సరఫరా చేయాల్సి ఉంటుంది. ఐదు రోజులుగా నీటిని నిలిపివేయడంతో ప్రజలు తాగునీటికి పడరాని పాట్లు పడుతున్నారు.

**ప్రజల అవస్థలు**

హుస్నాబాద్ మున్సిపాలిటీలో మున్సిపల్ అధికారులు ట్యాంకర్ల ద్వారా మూడు బిందెల చొప్పున ఇస్తున్న నీరు సరిపోవడం లేదని జనం గగ్గోలు పెడుతున్నారు. ట్యాంకర్ ఎప్పుడు వస్తోందో తెలియక పనులు విడిచిపెట్టి ఇంటి ముందు బిందెలు, ప్లాస్టిక్ డబ్బాలు పెట్టుకొని ఎదురు చూస్తున్నారు. పట్టణానికి మూడు కిలో మీటర్ల దూరంలో ఉన్న డబుల్ బెడ్రూం ఇండ్లలో దాదాపు 200 కుటుంబాలు నివసిస్తున్నాయి. వీరికి బోరు బావులు లేవు. భగీరథ నీళ్లు వస్తేనే దాహం తీరుతుంది. వారిని పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. మున్సిపల్ అధికారులు ట్యాంకర్ ద్వారా సరఫరా చేస్తున్న నీరు సరిపోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### సోమవారం లోగా సరఫరా చేస్తాం

మహ్మదాపూర్‌లోని మిషన్ భగీరథ సంపునకు సంబంధించి సాంకేతిక సమస్యలు ఉత్పన్నమయ్యాయి. సబ్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన ప్యానల్ బోర్డు పూర్తిగా కాలిపోయింది. వాటి మరమ్మతులు యుద్ధ ప్రాతిపదికన చేయిస్తున్నాం. సోమవారం లోగా నీటి సరఫరాను పునరుద్ధరిస్తాం.

–రామ్‌కుమార్, ఈఈ, గ్రిడ్ డివిజన్, హుజురాబాద్

## దొమ్మాటలో చిరుతపులి కలకలం

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



చిరుత సంచారంపై వివరాలు అడిగి తెలుసుకుంటున్న బీట్ ఆఫీసర్ మధులత



చిరుత పాదముద్ర

**దౌల్తాబాద్(దుబ్బాక):** మండలంలో చిరుతపులి సంచారం కలకలం రేపింది. వివరాలు.. దొమ్మాట అటవీ శివారులో చిరుత పులి సంచరిస్తుందంటూ గ్రామస్తులు భయాందోళన వ్యక్తం చేశారు. శనివారం గ్రామ శివారులోని పంట పొలాల్లో చిరుత కనిపించినట్లు గ్రామానికి చెందిన కొందరు యువకులు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. దుబ్బాక సెక్షన్ అధికారి మల్లేశంతోపాటు బీట్ ఆఫీసర్ మధులత దొమ్మాట అటవీ ప్రాంతానికి చేరుకున్నారు. పరిసర ప్రాంతాలను పరిశీలించి పులి పాద ముద్రలు గుర్తించారు. చేగుంట మండలంలోని కొండాపూర్, ఉప్పర్‌పల్లి, అక్బర్‌పేట-భూంపల్లి మండలం అల్మాజీపూర్ లింగం చెరువు మీదుగా మండలంలోని దొమ్మాట అటవీ ప్రాంతానికి చిరుతపులి వెళ్లినట్లు పాదముద్రల ఆధారంగా నిర్ధారించారు. చుట్టు పక్కల గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. వ్యవసాయ పొలాల వద్ద పాడి పశువులు, గొర్రెలు, మేకలను ఉంచొద్దని, ఇండ్ల వద్ద కట్టేసుకోవాలని సూచించారు. అటవీ ప్రాంతంలో సీసీ కెమెరాలు అమర్చామని, త్వరలో పట్టుకుంటామని అటవీ శాఖ అధికారులు తెలిపారు.

# వేర్వేరు చోట్ల నలుగురు అదృశ్యం



గౌతమ్ కుమార్

**పటాన్‌చెరు టౌన్:** యువకుడు అదృశ్యమైన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఏఎస్ఐ అశోక్ వివరాల ప్రకారం... మండలంలోని రామేశ్వరం బండ గ్రామానికి చెందిన గోపాల్ రామ్ కుమారుడు గౌతమ్ కుమార్ కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 21న రాత్రి ఇంటికి రాకపోవడంతో అతడికి కుటుంబ సభ్యులు ఫోన్ చేశారు. తాను ఇంటికి రానని, తన స్నేహితుడు సాయికిరణ్‌తో గొడవ జరిగిందని, హఫీజ్‌పేట్‌కి వెళ్తున్నానని చెప్పి ఫోన్ కట్ చేశాడు. తిరిగి ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో కుటుంబ సభ్యులు గౌతమ్ కోసం తెలిసిన వారు, స్థానికంగా వెతికినా ఆచూకీ లభించలేదు. తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

**పుల్‌కల్‌లో వృద్ధుడు..**

**పుల్‌కల్(అందోల్):** ఇంటి నుంచి బయటకు వెళ్లిన వృద్ధుడు అదృశ్యమయ్యాడు. ఎస్ఐ విశ్వజన్ కథనం ప్రకారం... మండల పరిధిలోని పెద్దారెడ్డిపేటకు చెందిన గంతి కాశీనాథం(65)ఈ నెల 20న మునిపల్లిలోని బంధువుల ఇంటికి వెళుతున్నానని బయలుదేరాడు. కానీ, బంధువుల ఇంటికి వెళ్లలేదు. మూడు రోజుల నుంచి వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

**ఇంటి నుంచి బయటకు వెళ్లిన బాలిక..**



ఆసియా

**పటాన్‌చెరు టౌన్:** బయటకు వెళ్లిన బాలిక అదృశ్యమైన ఘటన బీడీఎల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన జిగేన్ బతుకుదెరువు కోసం వచ్చి తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఘనపూర్ సమీపంలోని ఓ కంపెనీలో కూలి పని పనిచేసుకుంటూ అక్కడే ఉంటున్నారు. ఈ నెల 21న జిగేన్ కూతురు ఆసియా ఎవరికి చెప్పకుండా బయటికి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు స్థానికంగా, తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు.

**నర్సాపూర్‌లో వ్యక్తి..**

**నర్సాపూర్ రూరల్:** వ్యక్తి అదృశ్యమైన ఘటన నర్సాపూర్‌లో శనివారం వెలుగు చూసింది. ఎస్సై లింగం వివరాల ప్రకారం... పట్టణానికి చెందిన మహమ్మద్ అఖిల్ అలియాస్ మహమ్మద్ ఫక్రు పోలీస్ స్టేషన్ ఎదురుగా మిర్చి బండి నడుపుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ నెల19వ తేదీ రాత్రి వరకు మిర్చి బండి నడిపి ఆ తర్వాత ఇంటికి వెళ్లకుండా కనిపించకుండా పోయాడు. కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

### రైలు ఎక్కుతూ కిందపడి..



కిష్టయ్య

**మనోహరాబాద్(తూప్రాన్):** రైలు ఎక్కబోయి కిందపడి వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మనోహరాబాద్ రైల్వేస్టేషన్ వద్ద శనివారం చోటు చేసుకుంది. కామారెడ్డి రైల్వే ఎస్ఐ లిబాంధ్రి వివరాల ప్రకారం... మండల కేంద్రానికి చెందిన తాడేపు కిష్టయ్య ( 71 ) రైల్వేలో లోకో పైలట్‌గా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేశాడు. కాగా కుటుంబ సభ్యులతో బొల్లారం రైల్వే స్టేషన్ దగ్గరలో నివాసం ఉంటున్నాడు. అతడికి వ్యవసాయ పొలం ఉండటంతో గ్రామానికి వచ్చి పనులు ముగించుకుని తిరిగి ఇంటికి వెళుతున్నాడు. ఈ క్రమంలో మనోహరాబాద్ రైల్వే స్టేషన్ వద్ద బోధన్– కాచిగూడ పాసింజర్ రైలు కదులుతుండగా బోగిలోకి ఎక్కబోయి అదుపుతప్పి రైలు కింద పడిపోయాడు. ఈ ప్రమాదంలో అతడు రెండు కాళ్లు కోల్పోయాడు. గమనించిన స్థానికులు మేడ్చల్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ చనిపోయాడు. మృతునికి భార్య, కుమారుడు, నలుగురు కుమార్తెలున్నారు.

# టిప్పర్ ఢీకొని వ్యక్తి దుర్మరణం

**కొండాపూర్(సంగారెడ్డి):** రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన శనివారం గుంతపల్లిలో చోటు చేసుకుంది. కొండాపూర్ ఎస్సై సోమేశ్వరి కథనం ప్రకారం... గ్రామానికి చెందిన రాములు(50) ఉదయం 8 గంటల ప్రాంతంలో తన ద్విచక్ర వాహనంపై గ్రామ శివారులో ఉన్న పొలానికి వెళ్లాడు. తిరిగి వస్తున్న క్రమంలో ఎదురుగా వస్తున్న టిప్పర్ ఢీకొట్టింది. డ్రైవర్ తన టిప్పర్‌ను అతి వేగంగా నడపడం వల్లే ప్రమాదం జరిగిందని కుటుంబసభ్యులు ఆరోపించారు.

**రెండు ద్విచక్ర వాహనాలు ఢీ.. ఒకరు మృతి**

**హుస్నాబాద్:** రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందాడు. ఈ ఘటన శనివారం హుస్నాబాద్‌లో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం... పట్టణంలోని బస్ డిపో రోడ్డులో మడద గ్రామానికి చెందిన బూడిద అజయ్ (30), తన తల్లితో కలిసి పాల కేంద్రం నుంచి పాలు తీసుకొని బైక్‌పై వెళుతున్నారు. అదే సమయంలో అటుగా ఆరపల్లెకు చెందిన నమిలికొండ రామకృష్ణ బైక్‌పై వస్తున్నాడు. ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొనడంతో ఇరువురు కిందపడిపోయారు. అజయ్‌తో పాటు తన తల్లికి తీవ్ర గాయాలు కాగా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అజయ్ చనిపోగా, ఆయన తల్లి తలకు తీవ్ర గాయాలవడంతో కరీంనగర్‌కు తరలించారు. మరో బైక్‌పై ఉన్న రామకృష్ణకు సైతం గాయాలయ్యాయి. మృతుడుకి భార్య, కూతురు ఉన్నారు. మృతి చెందిన అజయ్‌కి న్యాయం చేయాలని ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలోని రోడ్డుపై బంధువులు, గ్రామస్తులు, బీఎస్పీ నాయకులు ధర్నా నిర్వహించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని బాధితులకు న్యాయం చేస్తామని చెప్పడంతో ధర్నా విరమించారు.

# డెంగీతో ఇంటర్ విద్యార్థి మృతి



శ్రావణ్

**జగదేవ్‌పూర్(గజ్వేల్):** డెంగీ జ్వరంతో ఇంటర్ విద్యార్థి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని తిమ్మాపూర్‌లో శనివారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన నాయిని మహేందర్-పోచమ్మ దంపతుల కుమారుడు శ్రావణ్(17) గజ్వేల్‌లోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ బైపీసీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. మూడు రోజుల క్రితం శ్రావణ్‌కు జ్వరం రావడంతో గ్రామంలోని ఓ ప్రైవేటు క్లినిక్‌లో చికిత్స చేయించుకున్నాడు. జ్వరం ఎక్కువ అవడంతో శుక్రవారం రాత్రి గజ్వేల్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి, పరిస్థితి విషమంగా ఉండటంతో కొంపల్లిలోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకు వెళ్లారు. అక్కడ రక్త పరీక్షలు నిర్వహించిన వైద్యులు డెంగీ జ్వరంగా గుర్తించారు. చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మృతి చెందాడు.

# కూతురి మృతి తట్టుకోలేక తండ్రి..

**హవేళిఘణాపూర్(మెదక్):** కన్న కూతురు మృతి తట్టుకోలేక ఓ తండ్రి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మండల పరిధిలోని సర్దన గ్రామంలో వెలుగు చూసింది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పిల్లి కృష్ణ(40) పెద్ద కుమార్తె వెంకటలక్ష్మి గత ఏడాది క్రితం అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందింది. ఈ విషయంలో తండ్రి అనేకమార్లు బాధపడుతుండేవాడు. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపానికి గురై శుక్రవారం రాత్రి ఇంట్లో నుంచి వెళ్లిపోయి గ్రామ శివారులోని కుంటకట్ట వద్ద గల చెట్టుకు ఉరివేసుకున్నాడు.

**నర్సాపూర్‌లో మహిళ...**

**నర్సాపూర్ రూరల్:** అనారోగ్య సమస్యలతో ఓ మహిళ ఆత్మహత్య వేసుకుంది. ఈ ఘటన శనివారం నర్సాపూర్‌లో జరిగింది. ఎస్సై లింగం వివరాల ప్రకారం... పట్టణానికి చెందిన చిత్తారి శాంత (34) కొంతకాలంగా తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతోంది. ఈ క్రమంలో మనస్తాపంతో ఇంట్లో ఎవరు లేని సమయంలో చేసుకుంది. మృతురాలికి కుమారుడు, భర్త శ్రీనివాస్ ఉన్నారు.

**అనారోగ్యంతో వృద్ధురాలు...**

**బెజ్జంకి(సిద్దిపేట) :** అనారోగ్య సమస్యలతో ఓ వృద్ధురాలు ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన మండల పరిధిలో జరిగింది. పోలీసుల వివరాలు ఇలా... తోటపల్లి గ్రామానికి చెందిన రేవోజు లక్ష్మి(55) స్వగ్రామంలోనే వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తుంది. అనారోగ్యంతో నాలుగేళ్ల క్రితం భర్త శంకరయ్య మృతి చెందాడు. వారి ముగ్గురు కూతుర్లకు వివాహాలు జరిగాయి. లక్ష్మి ఒంటరిగానే ఉంటోంది. నెల రోజులుగా అనారోగ్య సమస్యలతో ఆమె బాధ పడుతుంది. ఆస్పత్రిలో పరీక్షలు నిర్వహించగా లివర్ చెడిపోయిట్లు గుర్తించారు. చికిత్స నిమి త్తం కరీంనగర్ వెళ్లేందుకు బెజ్జంకి బ్యాంకు ఖాతా లో ఉన్న డబ్బులు తీసుకువస్తానని బిడ్డలకు చెప్పి శుక్రవారం వెళ్లింది. తిరిగి సాయంత్రం వరకు ఇంటికి రాకపోవడంతో గ్రామంలో ఆరా తీయగా మా మిడితోట వైపునకు వెళ్లినట్లు చెప్పారు. వెంటనే కూతుర్లు అక్కడకువెళ్లి చూడగా క్రిమిసంహారక మందు తాగి బావిలో దూకినట్లు గుర్తించారు. అనారోగ్యంతో మనస్తాపం చెంది లక్ష్మి ఆత్మహత్యకు పాల్పడినట్లు కుమార్తె పోలీసులకు ఫిర్యాదు చేసింది.

**నిజాంపేటలో మహిళ..**



వొగుల రాజవ్వ

**నిజాంపేట(మెదక్):** మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన శనివారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే... మండల కేంద్రానికి చెందిన వొగుల రాజవ్వ(55) తన ఇంట్లో ఎవ్వరు లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. బయటి నుంచి కొడుకు ఇంటికి తిరిగి వచ్చి చూసే సరికి ఆత్మహత్య చేసుకొని కనిపించింది. మృతి గల కారణాలు తెలియాల్సి ఉంది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలిస్తున్నారు.

### వ్యవసాయంలో నష్టం రావడంతో..



సత్తయ్య

**దౌల్తాబాద్(దుబ్బాక):** రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండల పరిధిలోని ఉప్పర్‌పల్లిలో శనివారం జరిగింది. ఎస్ఐ అరుణ్‌కుమార్ కథనం ప్రకారం... గ్రామానికి చెందిన పుట్ట సత్తయ్య (60) వ్యవసాయంలో నష్టం రావడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈ నేపథ్యంలో సత్తయ్య తన సమీప బంధువైన లింగరాజుపల్లికి చెందిన అల్లుడు మర్కంటి స్వామికి ఫోన్ చేసి చనిపోతున్నానని చెప్పాడు. అప్రమత్తమైన స్వామి మృతుడి పెద్ద కుమారుడు నరేశ్‌కు సమాచారం అందించాడు. దీంతో అతడు వ్యవసాయ పొలం వద్దకు వెళ్లగా అక్కడ అప్పటికే ఓ చింత చెట్టుకు సత్తయ్య ఉరివేసుకుని మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.